క్లుప్తంగా

అడ్మిషన్ గడువు పెంపు

మహబూబాబాద్ అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ పొందుటకు ఈనెల 31వ తేదీ వరకు గడువు పెంచినట్లు మానుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.రాజు, కోఆర్డినేటర్ మల్లేశం శనివారం తెలిపారు. వివరాలకు 73829 29705 సంప్రదించాలన్నారు. అదేవిధంగా ఈనెల 28 నుంచి అంబేడ్కర్ ఓపెన్ డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీల మొదటి సెమిస్టర్ విద్యార్థులకు ప్రత్యక్ష తరగతులు ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5:30గంటల వరకు నిర్వహిస్తున్నామన్నారు.

భూకబ్జాకు యత్నం

మహబూబాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని బ్యాంక్ కాలనీలో గల సుమారు 528 గజాల మున్సిపల్ స్థలాన్ని కబ్జాకు యత్నిస్తున్న వారిపై చర్య తీసుకోవాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి డిమాండ్ చేశాడు. సీపీఐ, బ్యాంక్ కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శనివారం కమిషనర్ ప్రసన్నరాణికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా అజయ్‌సారథి రెడ్డి మాట్లాడుతూ.. సుమారు కోటి రూపాయల విలువైన మున్సిపాలిటీ భూమి పరిరక్షణకు తక్షణమే చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పెరుగు కుమార్, కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు నరేందర్‌రెడ్డి, సంజీవ రావు, రాజేశ్వర్‌రావు, రాంమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



కురవి: చట్టాలపై బాలికలకు అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, మహబూబాబాద్ సీనియర్ సివిల్ జడ్జి సి.సురేష్ అన్నారు. శనివారం సీరోలు మండల కేంద్రంలోని ఏకలవ్య గిరిజన మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లైంగిక వేధింపులపై బాలికలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మౌనిక, ప్రభుత్వ ప్లీడర్ జి.వెంకటయ్య, ప్రిన్సిపాల్ చైతన్య, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సీరోలు ఎస్సై విజయ్ రాంకుమార్ పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

మహబూబాబాద్ రూరల్: ప్రజాతంత్ర దినపత్రిక, టీడబ్ల్యూజేఏ క్యాలెండర్లను మహ ఎమ్మెల్యే మురళీనాయక్ శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూ (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు చిత్తనూరి శ్రీనివాస్, సెక్రటరీ గాడిపల్లి శ్రీహరి, గిరిజన జర్నలిస్టు సంఘం జిల్లా అధ్యక్షుడు తేజావత్ రవినాయక్, ప్రజాతంత్ర జిల్లా ప్రతినిధి వీరంటి ముఖేష్, గుండోజు శ్రీనివాస్, భూక్య మోహన్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వేడుకలు



మహబూబాబాద్ రూరల్: సువర్చలాహనుమత్ కల్యాణోత్సవ వేడుకలను భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో పీఎస్ఆర్ గార్డెన్స్ ఆవరణలో శనివారం వైభవంగా నిర్వహించారు. సంస్థ సెక్రటరీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో సువర్చలాహనుమత్ కల్యాణాన్ని వేద పండితులు సుబ్రహ్మణ్య శర్మ, మైలవరపు శ్రీమన్నారాయణ శర్మ, పరాంకుశం ఆచార్యులు, శ్రేష్ఠ చంద్రశేఖర్, జి.గౌరీనాథ శాస్త్రి నిర్వహించారు.

అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ



దంతాలపల్లి: మండలం రేపోని గ్రామంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శనివారం అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగిరెడ్డి శైలజవెంకటరెడ్డి, ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ బిర్రు మహేందర్, ధర్మారపు పవన్‌కుమార్, చాగంటి రమేష్, నకరకంటి వెంకన్న పాల్గొన్నారు.

ఐదోసారి ఉత్తమ సేవా పురస్కారం



దంతాలపల్లి: నిస్వార్థ సేవే లక్ష్యంగా పని చేస్తూ మండలకేంద్రంలో ఆర్‌ఐగా విధులు నిర్వహిస్తున్న నజీముద్దీన్ శుక్రవారం గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నాడు. దీంతో ఆయన ఐదుసార్లు పురస్కారం అందుకున్నాడు.

చెకుముకి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



మహబూబాబాద్ అర్బన్: ఎంపికైన విద్యార్థులు



గార్ల: గెలుపొందిన విద్యార్థులు



కురవి: బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు



పెద్దవంగర: ప్రశ్నపత్రాలు విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి విజ్ఞానాన్ని పెంపొందించి దేశ ప్రగతికి ఉపయోగించుకొనేందుకు జనవిజ్ఞాన వేదిక నిర్వహిస్తున్న సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించడం అభినందనీయమని ఏరియా ఆస్పత్రి డీసీహెచ్‌ఓ డాక్టర్ భూక్య వెంకట్రాములు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. నాలుగు టీంలతో 12 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పొక్కుల సదానందం, చెకుముకి మండల అధ్యక్షుడు బండి నరేందర్ రెడ్డి, కన్వీనర్ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి సునీత, జిల్లా అధ్యక్షుడు తడకమల్ల బ్రహ్మం, సహాయ అధ్యక్షుడు మంగపతిరావు పాల్గొన్నారు.

బయ్యారం: సైన్స్‌పై విద్యార్థుల్లో అభిరుచిని పెంచేందుకే చెకుముకి పోటీలు నిర్వహిస్తున్నట్లు వేదిక జిల్లా కార్యదర్శి ఆర్.వి.ప్రసాదరావు అన్నారు. మండల స్థాయిలో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు శనివారం సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో వేదిక మండల అధ్యక్షుడు శ్రీనివాస్, రిటైర్డ్ హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి, హెచ్‌ఎంలు దేవేంద్రాచారి, లక్ష్మణ్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గూడూరు: మండల కేంద్రంలో నిర్వహించిన పోటీల్లో ఇంగ్లిషు మీడియం విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విభాగాలలో అయోధ్యపురం జెడ్పీహెచ్‌ఎస్, గూడూరు బాలుర హైస్కూల్, పొనుగోడు హైస్కూల్ విద్యార్థులు గెలుచుకోగా, తెలుగు మీడియంలో గూడూరు ప్రభుత్వ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రథమ, బాలుర హైస్కూల్ ద్వితీయ, తృతీయ విభాగంలో తీగలవేణి హైస్కూల్ విద్యార్థులు గెలుచుకున్నారు. కార్యక్రమంలో ఎంఎన్‌ఓ, హెచ్‌ఎం చీర భిక్షపతి, జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు చాపల సంపత్, రవి, బింగి రమేష్, ఉపాధ్యాయులు సదాశివ, అనిల్, అలీ, హరిశంకర్, శ్రీరాములు పాల్గొన్నారు.

గార్ల: గార్ల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం మండలస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో తెలుగు మీడియంలో గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రథమ బహుమతి, మద్దివంచ హైస్కూల్ ద్వితీయ బహుమతి, ఇంగ్లిష్ మీడియంలో నిర్మలా హైస్కూల్ ప్రథమ, సమత హైస్కూల్ ద్వితీయ బహుమతి గెలుచుకుంది. జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు సుందర్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు ఎడ్ల అప్పయ్య, మండల కన్వీనర్ షరీఫ్, భాస్కర్, సీహెచ్ రమేష్, శీలంశెట్టి రమేష్ పాల్గొన్నారు.

కురవి: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ మండలస్థాయి పరీక్ష శనివారం నిర్వహించారు. ఇంగ్లిష్ మీడియం నుంచి నేరడ మోడల్ స్కూల్ విద్యార్థులు జాహ్నవి, మాధవ్, మహేష్, తెలుగు మీడియం నుంచి నేరడ కస్తూర్బా గాంధీ పాఠశాలకు చెందిన అక్షయ, వసంత, హేమలత జిల్లాస్థాయి పరీక్షకు ఎంపికైనట్లు జిల్లా కన్వీనర్ వెంపటి విజయ్‌రాజ్ తెలిపారు. జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ముత్యాల శ్రీధర్, దైద వెంకటేశ్వర్లు, ప్రసాద్, వీరన్న, హారిక, కళావతి, మాంజీ, ప్రభాకర్, నరసింహచారి పాల్గొన్నారు.

దోర్నకల్: స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో శనివారం మండలస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. టెస్ట్ ప్రశ్నాపత్రాలను హెచ్‌ఎంలు ఆంగోత్ లక్ష్మా, నర్సింహారావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి కె.భిక్షపతి, ఉపాధ్యాయులు రమేష్, నాగేశ్వర్‌రావు, మంజులత, వసంతరాణి, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

దంతాలపల్లి: మండలకేంద్రంలో గల జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాలలో ప్రభుత్వ విభాగంలో ఇంగ్లిష్ మీడియంలో జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ప్రథమ స్థానం, ప్రైవేట్ విభాగంలో సెయింట్ మేరీ హైస్కూలు విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి శ్రీదేవి, హెచ్‌ఎం వేణుమాధవరెడ్డి, జేవీవీ మండల అధ్యక్షుడు తాళ్ల మహిపాల్‌రెడ్డి, మండల కన్వీనర్ గుర్రం వెంకన్న, ఉపాధ్యాయులు హర్షవర్ధన్‌రెడ్డి, సాయి, రజిని పాల్గొన్నారు.

కొత్తగూడ: మండల పరిధిలో ఇంగ్లిష్ విభాగంలో ఏకలవ్య గురుకుల పాఠశాలకు చెందిన ప్రణీత్, గ్రేస్‌రాజ్‌పాల్, వంశీకృష్ణలు, తెలుగు మీడియం విభాగంలో ఎదుళ్లపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని నవ్య ప్రతిభ కనపరిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దేవదాస్, జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు పుల్సం సాంబయ్య, ప్రిన్సిపాల్ వెంకన్న, బిక్షం పాల్గొన్నారు.

తొర్రూరు: డివిజన్ కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 15 టీంలు పాల్గొన్నాయి. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వినోద్‌కుమార్, ఎంఎన్‌ఓ మహంకాళి బుచ్చయ్య, జేవీవీ మండల అధ్యక్షుడు ఎర్ర పూర్ణచందర్, పాఠశాల కరస్పాండెంట్ దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పెద్దవంగర: మండల కేంద్రంలో మండల స్థాయిలో ప్రథమ బహుమతులు పెద్దవంగర పాఠశాలకు చెందిన నాని, సుప్రియ, రజిని ద్వితీయ బహుతులు శ్యామిని, అప్సర్, ఐసులు సాధించారు. అవుతాపురంలో ప్రథమ బహుమతి ప్రేమ్‌కుమార్, సాయికుమార్, స్ఫూర్తి, ద్వితీయ బహుమతి అనుష్క, బిందు, సిద్దులు బహుమతులు సాధించినట్లు హెచ్‌ఎం బుధారపు శ్రీనివాస్ తెలిపారు.

నెల్లికుదురు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండల స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు ఇంగ్లిష్ మీడియం విభాగంలో మేచరాజుపల్లి పాఠశాల ప్రథమ స్థానం, తెలుగు మీడియం విభాగంలో ఆలేరు పాఠశాల ప్రథమ స్థానం పొంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపికై ద్వితీయ స్థానం మోడల్ స్కూల్ గెలుపొందినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి తెలిపాడు.



గూడూరు: బహుమతులు అందిస్తున్న ఎంఎన్‌ఓ భిక్షపతి

చిన్నగూడూరు: మండల కేంద్రంలో తెలుగు మీడియంలో చిన్నగూడూరు పాఠశాల విద్యార్థులు కాయిత సాత్విక్, లక్ష్మణ్, మురారి గణేష్ ప్రథమ స్థానంలో నిలిచారు. ఇంగ్లిష్ మీడియం విభాగంలో జయ్యారం పాఠశాల విద్యార్థులు జంపన్న, నసీబ్, చరణ్ ప్రథమ స్థానంలో నిలిచారు. హెచ్‌ఎంలు రవికుమార్, ఉషశ్రీ సర్టిఫికెట్స్ అందజేశారు.

గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



జీపీ కార్యాలయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పెద్దవంగర: గ్రామాల సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ కృషి చేస్తుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డితో కలిసి పర్యటించారు. అవుతాపురం, రాజ్‌మాన్ సింగ్ తండా, కాన్వాయిగూడెం గ్రామాల్లో నూతన గ్రామ పంచాయతీ కార్యాలయాలను ఆయా గ్రామాల సర్పంచ్‌లు సల్దెండి మంజుల, మద్దెల కరుణ, గుగులోత్ పటేల్ నాయక్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని పాలించడంలో సచివాలయం ఎంత కీలక పాత్ర పోషిస్తుందో గ్రామాన్ని అభివృద్ధి సాధించడంలో జీపీ కార్యాలయాలు తోడ్పాటు అందిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజేశ్వరి, జెడ్పీటీసీ జ్యోతిర్మయి, నాయకులు కేతిరెడ్డి నిరంజన్ రెడ్డి, నెమరుగొమ్ముల ప్రవీణ్ రావు, బానోతు సీతారాం నాయక్, అనపురం శ్రీనివాస్, దాసరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోండి



దరఖాస్తు ఫారాలు చూపిస్తున్న నాయకులు

మహబూబాబాద్ రూరల్: విద్యావంతులు, మేధావులు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటు హక్కు నమోదు చేసుకోవాలని మహబూబాబాద్ అర్బన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఘణపురపు అంజయ్య, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చుక్కల ఉదయ్ చందర్ కోరారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల అవగాహన సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ తరఫున తెలంగాణ రాష్ట్ర ప్రజల గొంతుక తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌ను శాసనమండలికి పంపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎల్‌డీఎం కోఆర్డినేటర్ బండి శ్రీనివాస్ గౌడ్, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు శంతన్ రామరాజు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రాంశెట్టి వీరేందర్, కాంగ్రెస్ అధ్యక్షుడు గునిగంటి కమలాకర్, ప్రసాద్ నాయక్ పాల్గొన్నారు.

హక్కుల రక్షణకు ఉద్యమాలు



మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

దోర్నకల్: పేదల హక్కుల రక్షణ కోసం నిరంతరం ఉద్యమాలు చేస్తామని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి తెలిపారు. దోర్నకల్‌లో శనివారం జరిగిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ పాలనపై ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారని తెలిపాడు. భక్తిని, మతాన్ని రాజకీయాలతో కలగలిపి పార్లమెంటు ఎన్నికల్లో లబ్ధి పొందాలని బీజేపీ నేతలు ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశాడు. పార్టీ శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని పార్టీ వీరోచిత పోరాటాలను ప్రజల్లో ప్రచారం చేసి సభ్యత్వాన్ని పెంచేందుకు కార్యకర్తలు కృషి చేయాలని కోరాడు. సమావేశంలో మండల కార్యదర్శి తురక రమేష్, నాయకులు నెల్లూరి నాగేశ్వర్‌రావు, కె.ప్రభేష్, స్వామి, పోలెపాక వెంకన్న పాల్గొన్నారు.

ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలి మౌనదీక్ష



మౌన దీక్ష చేస్తున్న యువతి

కొత్తగూడ : ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలు మౌన దీక్షకు దిగిన సంఘటన మండలంలోని వేలుబెల్లిలో శనివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. వేలుబెల్లి గ్రామానికి చెందిన ఓ యువతిని అదే గ్రామానికి చెందిన జెల్లల ప్రశాంత్ యాదవ్ అనే యువకుడు ప్రేమిస్తున్నానని మాయ మాటల చెప్పి శారీరకంగా లొంగదీసుకున్నాడు. ఇప్పుడు మరో యువతితో పెళ్లికి సిద్ధమయ్యాడు. విషయం తెలుసుకున్న సదరు యువతి ప్రశాంత్ యాదవ్‌ను నిలదీయడంతో ముఖం చాటేశాడు. దీంతో ప్రియుడి ఇంటి ఎదుట యువతి మౌన దీక్షకు దిగింది. విషయం తెలుసుకున్న గూడూరు సీఐ ఫణిదర్, కొత్తగూడ ఎస్సై నగేష్ యువతి వద్ద కు చేరుకుని ఆమె నుంచి ఫిర్యాదు తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ప్రశాంత్ పరారీలో ఉన్నట్లు వివరించారు.

సద్వినియోగం చేసుకోవాలి

కురవి: పదో తరగతి విద్యార్థుల కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 9, 10వ తేదీల్లో నిర్వహించే టాలెంట్ టెస్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఎఫ్ఐ మరిపెడ డివిజన్ కార్యదర్శి గంధసిరి జ్యోతిబసు తెలిపాడు. శనివారం మండల కేంద్రంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఎస్సెస్సీ విద్యార్థులు టెస్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నాడు. పరీక్షకు రూ.25 చెల్లించాలని, 99481 54021 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. వీరేందర్, మౌలానా, వెంకీ, గణేష్, పరమేష్ పాల్గొన్నారు.

మార్క్స్, లెనిన్ పేర్లు తొలగించాలి

బయ్యారం: పీడిత ప్రజల విముక్తి కోసం మార్గం చూపిన మహనీయులను గుంటూరు కారం సినిమాలో విలన్లుగా చూపటం సరికాదని పీవైఎల్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, సురేష్ అన్నారు. మహనీయులు మార్క్స్, లెనిన్ పేర్లను తొలగించాలన్నారు. శనివారం బయ్యారంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో రాజు, వెంకటేష్, హరిసింగ్ పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

నెల్లికుదురు: దాడిచేసి గాయపర్చిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ శనివారం తెలిపాడు. మండలంలోని ఎర్రబెల్లిగూడెం గ్రామానికి చెందిన మచ్చ పుల్లయ్యపై ఇదే గ్రామానికి చెందిన బండారి కృష్ణ ఈనెల 25న గొడ్డలి కామతో దాడి చేసినట్లు బాధితుడి కుమారుడు మచ్చ రాజ్‌కుమార్ ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపాడు. ఈమేరకు బండారి కృష్ణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నాడు.

‘పరీక్షా పే’కు ఏకలవ్య బాలికల ఎంపిక



కురవి: ఈనెల 29వ తేదీన ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పరీక్షా పే చర్చా కార్యక్రమానికి కురవి మండల కేంద్రంలోని ఏకలవ్య గిరిజన బాలికల మోడల్ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సంతోష్ శనివారం తెలిపాడు. పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని అక్షయ, ఇంటర్మీడియట్ బైపీసీకి చెందిన మహేశ్వరీ, గోవర్ధని ఎంపికయ్యారు. రాష్ట్రంలోని 23 ఏకలవ్య పాఠశాలల నుంచి పది మంది విద్యార్థులు ఎంపికకాగా ఇందులో ముగ్గురు బాలికలు కురవికి చెందడం విశేషం. ఎంపికైన విద్యార్థినులను ఈఎంఆర్ఎస్ సెక్రటరీ నవీన్ నికోలస్, డిప్యూటీ సెక్రటరీ చంద్రశేఖర్, పాఠశాల ఉపాధ్యాయులు, అధ్యాపకులు అభినందించారు.

సంక్షిప్త సమాచారం

గిరిజనేతర రైతుల సమస్యలు పరిష్కరించాలి



గూడూరు: ఏజెన్సీ మండలాల్లో గిరిజనేతరులు 50ఏళ్లుగా సాగు చేసుకుంటున్న సాగు భూములకు రక్షణ లేకుండా పోవడంతో ఎంతో ఇబ్బందులు పడుతున్నారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి అన్నారు. హైదరాబాద్‌లో శనివారం జిల్లా ఇన్‌చార్జ్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఆయన కల్సి సమస్యలను వివరించాడు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు ఎండి.యాకూపాష, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కార్యదర్శిపై చర్య తీసుకోవాలి

మరిపెడ రూరల్: గ్రామంలో మూడు సంవత్సరాలుగా వసూలు చేస్తున్న ఇంటి పన్ను డబ్బులు సుమారు లక్ష రూపాయలు గ్రామ పంచాయతీలో జమచేయకుండా కాజేసిన వెంకట్యతండా గ్రామ కార్యదర్శిపై వెంటనే చర్య తీసుకోవాలని సర్పంచ్ గుగులోతు సూరనాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ.. కార్యదర్శిపై సంబంధిత ఎంపీఓ, ఎంపీడీఓకు గతంలో అనేకసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయంపై కలెక్టర్, డీపీఓకు ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ తెలిపాడు.

బీఎస్పీ మండల అధ్యక్షుడిగా సుధాకర్



గార్ల: బీఎస్పీ మండల కార్యవర్గాన్ని శనివారం పార్టీ ఇల్లెందు నియోజక వర్గ ఇన్‌చార్జ్ బాదావత్ ప్రతాప్, నియోజక వర్గ అధ్యక్షుడు అజ్మీర వెంకన్న ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మాలోత్ సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా బానోత్ దీప్లా, ఉపాధ్యక్షుడిగా మొగిలి శ్రీను, కార్యదర్శిగా శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు.

పుస్తకాల పంపిణీ

నెల్లికుదురు: మండలంలోని ఎంపీయూపీఎస్ పాఠశాలలోని 7వ తరగతి విద్యార్థులకు వనసంరక్షణ సేవాసమితి స్వచ్ఛంద సంస్థ ద్వారా రిటైర్డ్ హిందీ ఉపాధ్యాయుడు బండారి ఉప్పలయ్య రూ.14వేల విలువ చేసే టెస్టు బుక్స్‌లను అందించినట్లు హెచ్‌ఎం హరినాథ్ శనివారం తెలిపాడు. కార్యక్రమం సర్పంచ్ ఉప్పలయ్య, ఎంపీటీసీ సభ్యుడు కృష్ణయ్య, ఉపాధ్యాయులు సైదులు పాషా, గోవర్ధన్ పాల్గొన్నారు.

గిరిజన మోర్చా మండల అధ్యక్షుడిగా కిషన్



కురవి: బీజేపీ అనుబంధ గిరిజన మోర్చా మండల అధ్యక్షుడిగా భూక్య కిషన్‌నాయక్‌ను నియమించినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు బుడిగె భద్రసేనాగౌడ్ శనివారం తెలిపాడు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులు విద్యతోపాటు అన్నిరంగాల్లో రాణించాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డి.అమరావతి అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని అనంతారం మోడల్ స్కూల్‌లో శనివారం గణతంత్రలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో బహుమతులు గెలిచిన విద్యార్థులను అభినందించారు.

అధిక నిధులు కేటాయించాలి

కురవి: విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడారు. సీనియర్ ఉపాధ్యాయుడు జి.బాలును సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు ప్రవీణ్‌కుమార్, ప్రసాద్, సురేష్, లత, బాబు, రాజశేఖర్, వీరన్న, విజయరాణి, లక్ష్మీ, ప్రభావతి పాల్గొన్నారు.

క్షుద్రపూజల కలకలం

దోర్నకల్: సీరోలు మండల పరిధిలోని అందనాలుపాడు నుంచి కొత్తతండా, సాదుతండాకు వెళ్లే మూడు రోడ్ల కూడలిలో రోడ్డుపై శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గుమ్మడికాయలు, కొబ్బరికాయలు, నిమ్మకాయలు, పసుపు, కుంకుమలతో క్షుద్రపూజలు నిర్వహించారు. శనివారం ఉదయం ఈ మార్గంలో వెళ్తున్న వారు ఆందోళనకు గురయ్యారు.

రైతులను దోచుకుంటున్న వ్యాపారులు

కేసముద్రం: కేసముద్రం మార్కెట్ చుట్టుపక్కల కొందరు వ్యాపారులు, దళారులు మిర్చికి అడ్డగోలు ధరను నిర్ణయిస్తూ, కమీషన్ కింద దోచుకుంటున్నారని సీపీఐ మండల సహాయ కార్యదర్శి మంద భాస్కర్ శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు.

నల్లబెల్లం స్వాధీనం

దోర్నకల్: అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు దోర్నకల్ ఎస్సై ఝాన్సీ తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. కాస్నతండా శివారు సమ్మక్క గద్దెల వద్ద వాహన తనిఖీ నిర్వహిస్తుండగా నంబర్ లేని ఆటోలో అక్రమంగా తరలిస్తున్న నాలుగు క్వింటాళ్ల నల్లబెల్లం, అరక్వింటా పటికను పట్టుకున్నట్లు తెలిపారు. కురవి మండలం లింగ్యాతండాకు చెందిన మాళోత్ వెంకటేష్ ఆటోలో బెల్లాన్ని బోరింగ్‌తండాకు చెందిన వాంకుడోత్ మోహన్, తెల్లబండతండాకు చెందిన గుగులోత్ మహేష్‌కు సరఫరా చేస్తుండగా బెల్లం, ఆటోతో పాటు మోహన్, మహేష్‌ను పట్టుకున్నామని, వెంకటేష్ పరారీలో ఉన్నాడని తెలిపారు. సీఐ బి.ఉపేందర్‌రావు ఆదేశాల మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యా సామగ్రి అందజేత

పెద్దవంగర: విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను, ఉపాధ్యాయుల ఆకాంక్షలను నెరవేర్చాలని దాత ముత్తినేని లక్ష్మణ్ అన్నారు. శనివారం మండలంలోని అవుతాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న సుమారు 150మంది విద్యార్థులందరికీ తన తల్లిదండ్రులు ముత్తినేని మోహన్–విజయల జ్ఞాపకార్థం రూ.17 వేలు విలువ చేసే విద్యా సామగ్రిని అందజేశాడు. కార్యక్రమంలో హెచ్‌ఎం కళాధర్, గ్రామస్తులు కృష్ణమూర్తి శర్మ, భిక్షపతి, సత్తయ్య పాల్గొన్నారు.

నేడు మహిళా శక్తి సమ్మేళనం

మహబూబాబాద్ రూరల్: మహిళా శక్తి సమ్మేళనం ఖమ్మం జిల్లా కేంద్రంలోని దాబాల బజారులోని వాసవి గార్డెన్ ఆవరణలో ఆదివారం నిర్వహిస్తున్నామని కార్యక్రమ ప్రతినిధి జిల్లా వాణిదేవి శనివారం తెలిపారు. సమ్మేళనం ఉదయం 8:30 గంటలకు ప్రారంభం అవుతుందని మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

స్వయంపాలన దినోత్సవం



కేసముద్రం: మండలకేంద్రంలోని జెడ్పీహైస్కూల్‌లో స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలకు సత్యసాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.13వేల విలువైన క్రీడా సామగ్రి, రూ.3వేల విలువైన కథల పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజు, సర్పంచ్ బట్టు శ్రీను, ట్రస్ట్ సభ్యులు బ్రహ్మదేవర లలిత, మధులిక పాల్గొన్నారు.

ప్రొటోకాల్ విస్మరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



తొర్రూరు: జాతీయ జెండా ఆవిష్కరణకు ఎమ్మెల్యేను ఆహ్వానించకుండా బీఆర్ఎస్ నాయకులు ప్రొటోకాల్‌ను విస్మరించారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్ విమర్శించాడు. శనివారం కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. స్థానిక 100 ఫీట్ల జాతీయ జెండా ప్రాంగణంలో పతాకావిష్కరణకు ఎమ్మెల్యేను ఆహ్వానించకపోవడం ఏం సంస్కృతి అని ప్రశ్నించారు. ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటు చేసే జాతీయ జెండాను అధికారులే ఎగురవేయాలని, పార్టీ నాయకులతో ఆవిష్కరించాలని చూడడాన్ని తాము వ్యతిరేకించామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, నాయకులు సోమయ్య, సధాకర్, మురళి, మహేందర్, లచ్చలి లక్ష్మణ్ పాల్గొన్నారు.

‘గురువు దైవంతో సమానం’



చిన్నగూడూరు: విద్యాబుద్ధులు నేర్పే గురువు దైవంతో సమానమని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని జయ్యారం గ్రామంలో తనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువు పానుగంటి జగన్నాథరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి, పాదాభివందనం చేశారు. అనంతరం హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యానమందిరం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బతుకమ్మ ఘాట్‌లను సందర్శించారు. ధ్యానమందిరంలో డైరెక్టర్ పూసపాటి వెంకన్నను శాలువాతో సన్మానించారు. పాఠశాలలో టాయిలెట్స్ నిర్మాణానికి రూ. 5లక్షలు, బతుకమ్మ ఘాట్‌కు రూ. 5లక్షలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మంగళంపల్లి కన్నా, జెడ్పీటీసీ బుల వెంకన్న గౌడ్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లూరి కృష్ణారెడ్డి, ఎడ్ల వేణు, బానోత్ రవికుమార్, ఎల్ది మల్లయ్య , పాల్గొన్నారు.